కథానిక

# క్షుభిత పథగామి

"మంజుశ్రీ"

వెంకటేశ్వర్లు, కాఫీ తాగి అలానే కూర్చున్నాడు. ఎక్కడకు పోదామని బుద్ధి పుట్టటం లేదు. ఏదేనా పుస్తకం చూద్దామని పుస్తకాల బీరువా దగ్గరకెళ్ళాడు.

కేలెండరు అగుపడ్డది. వెంకటేశ్వర్లు జాగ్రత్తగా చూశాడు. అవాళ తను పుట్టినరోజు. వెంకటేశ్వర్లు పుస్తకంమాట అలానే మరచిపోయి, పోయి అద్దం ముందు నిలబడ్డాడు. ఆ అద్దం వెంకటేశ్వర్లను వెక్కిరించింది. వెంకటేశ్వర్లు ఆశ్చర్యపడ్డాడు. మొహంలో అస్పష్టంగా యిదివరకు లేని గీతలు కనపడుతున్నాయి. పోయి కూర్చున్నాడు కుర్చీలో, బయట వసారాలో, ముసలాయన దగ్గుతున్నాడు. గొణుగుతున్నాడు. ఎప్పుడూ, ప్రొద్దుట లేచింది మొదలు, తెల్లవారే వరకు గొణుగుతూనే వుంటాడాయన. కలవరింతల్లో కూడా యిదే గొణుగుడు. వెంకటేశ్వర్లు ముసలాయన గొణుగుడేమీ పట్టించుకోడు. విన్నైనా వినడు. ఐదారేళ్ళ దగ్గర్నుంచి వింటూనేవున్నాడు. వెంకటేశ్వర్లకు అలవాటయింది యీ జీవితం. ఇది వెంకటేశ్వర్ల ప్రస్తావన. ఇక వెంకటేశ్వర్ల పూర్వకథ.

ఆవాళ వెంకటేశ్వర్ల ఇరవై రెండో పుట్టింరోజు పండుగనాడు, రవణ బలవంతాన వెంకటేశ్వర్ల చేత టీపార్టీ చేయించుకుందామని. అవాళ వెంకటేశ్వర్ల అమ్మ వంట్లో సరిగ్గా లేకపోవటం వలన వెంకటేశ్వర్లు ఎవరినీ, తను పుట్టినరోజు పండగ మహోత్సవ సందర్భమున ఆహ్వానించి యుండలేదు. ఇందుమీద స్నేహితులు విమర్శించుకున్నారేగాని, ఎలాంటి నిశ్చయానికీ రాలేకపోయారు. రవణమాత్రం వెంకటేశ్వర్ల బుజంమీద చేయేసి బజారుకు లాక్కుపోయినాడు. వెంకటేశ్వర్ల దిగాలు మొహంచూసి, రవణ, ఏరో యేడుస్తున్నావు. కాఫీ కొద్దులే, పార్కుకెళదాంరా అన్నాడు. వెంకటేశ్వర్లు ఏమీ సమాధానం చెప్పలేదు. రవణ దీన్నిగురించి అట్టే అడగనూలేదు. కాఫీతాగి బిల్లు చేతికి తీసుకున్నదాకా అసలు మాట్లాడనేలేదు.

కాఫీతాగి అలా రోడ్డుమీద మళ్ళీ వొస్తుంటే, చింతచెట్టుకింద బైరాగులచేత జాతకం చూపించుకునే మనుష్యుల్లో నిలుచుండి పోయాడు రవణ. వెంకటేశ్వర్లు కూడా అక్కడనే నిలుచుండి పోయాడు.

బాబ్బాబు! మీ చేయి చూపించండి, అన్నాడు బైరాగి. రవణ చేయి చేతికిచ్చాడు. బైరాగి మొదలెట్టాడు. "మీరు స్వశక్తిమీదనే ఆధారపడి వుంటారు. ప్రతివిషయంలోనూ స్నేహితుల సహాయం ఎక్కువ. స్థిరచరాస్తులు లేవు. వచ్చేఏడు ఘుంటాపథంగా పెళ్ళయి తీరుతుంది. పెద్ద చదువు రాతలేదు." ఓరే రవణా, నే పోతున్నానురా, అన్నాడు వెంకటేశ్వర్లు. ఉండవోయ్ ఏడుపు మొహం, నువ్వూనూ, నేనిస్తాలే డబ్బులు, నువ్వు కూడా చెయి చూపించుకో, అన్నాడు రవణ.

బైరాగి చప్పున రవణచేయి వదిలేసి బాబ్బాబు రాండి. చూస్తే అసలు మీబోటివారి చేతినే చూడాలి. రవణలాగి కూచోబెట్టి, వెంకటేశ్వర్ల చెయి బైరాగి కందించాడు. 'పెళ్ళెప్పుడవుతుందో కాస్త' రవణ అంటుండగానే, వెంకటేశ్వర్లు చికాకుపడ్డాడు. బాబూ, ఒక రహస్యం చెబుతాను ఏమీ అనుకోరుగదా? చెప్పమంటారా వద్దా? అన్నాడు బైరాగి. రవణ చెప్పు, తొందరగా చెప్పు! అన్నాడు. మీరు గాఢంగా వొకరిని ప్రేమిస్తున్నారు. ఆ...ఎంతపని జరిగెన్, అన్నాడు రవణ. వెంకటేశ్వర్లు చెయి లాక్కోపోయాడు. ఎవరో ఆ తలోదరి...అన్నాడు రవణ.

అదుగో అలా కోప్పడతారనే బాబూ నేను చెప్పంది. మీకు ఆస్తి యెక్కువగావుంది. మీ

చేతిలో ఆ రేఖ అవపడుతునే వుంది. మీకు మీ ఆస్తిగాక, యిక యిద్దరి ఆస్థి కలిసొచ్చింది. మీకు భార్యామూలకంగా కూడా ఆస్థిరావాలసి వుంది. అదృష్టవంతులు. ఇరవైనాలుగోయేట పెళ్ళి అయి తీరాలి. అప్పుడప్పుడు అవాంతరాలు తప్పవు."

అవన్నీ సరేలే. మావాడు ప్రేమించిన అమ్మాయిని చేసుకొనగలడా, లేక ఏ రాజ కుమారుండైననూ, అంటున్నాడు రవణ.

వెంకటేశ్వర్లు లేచి నిల్చున్నాడు. రవణా వెళుతున్నానురా అన్నాడు.

పార్కులో యేడువు, ఇప్పుడే వస్తున్నాను. సిజర్ పాకెట్ వొకటి తీసుకపో ... అన్నాడు రవణ. వెంకటేశ్వర్లు వెళ్ళిపోయాడు.

రవణ బైరాగిని అడిగాడు—ఆ అమ్మాయిని వీడు చేసుకుంటాడా అని.

సూర్ అండీ...సూరు. ఐతే ఆయన చేతిలో రెండు పెళ్ళిళ్ళున్నాయి, అన్నాడు బైరాగి.

ఛా ఛా...అన్నాడు రవణ.

కావలిస్తే, పావలా యియ్యండి ప్రశ్న చెపు తాను అన్నాడు బైరాగి.

వద్దులే. ఇంకొద్దు. పావలా బైరాగి మొఖా నేసి రవణ పార్కులోకెళ్ళి పోయాడు.

వెంకటేశ్వర్లు సీమచింతచెట్టుకింద పచ్చగడ్డి మీద కూచుని గడ్డంకింద చెయిపెట్టుకొని ఆలో చిస్తుండగా, రమణ బుజం తట్టాడు "ఏరా, ఆ అమ్మాయిని గురించేనా, అంతగా ఆలోచిస్తు న్నావు" అంటూ.

వెంకటేశ్వర్లు సీరియస్ అయినాడు. వెధవ్వా గుడు వాగకు రవణా, ఎప్పుడూ గోల, అన్నాడు.

ఏమిటోయ్, లేకపోతే మహా హీరోలాగా, అప్పుడే ప్రేమించటమా? ఇంకేం ప్రేమలో పడ్డావు గాబోలు. పది రోజులనుంచీ చూస్తూనే వున్నాను నీ వాలకం! విరహంలో వేగుతున్నావు కాబోలు. అణాకాని మొహమేసుకుని...నోర్మూ యరా, సెన్సు లేకపోతేసరి. అన్నాడు వెంకటేశ్వర్లు

ఎందుకురా, అలా ఇదయిపోతావు? అసలు సంగతినాకు చెప్పు. నే చెపుతా తరువాత సంగతి. అన్నాడు రవణ ఏమిటిరా, నీ మొహం, చెప్పేది. జాతకాల సంగతి నేను నమ్మను, అన్నాడు వెంక టేశ్వర్లు. అవన్నీ అలావుంచవోయ్. ఆ అమ్మాయి ఎవరంట? ఓరే, అమ్మాయిలేదు, అబ్బాయిలేదు, నోర్మూయరా అన్నాడు వెంకటేశ్వర్లు, ఇదిగో నీ యిష్టం చెపుతున్నాను, ఇక నోరు తెరిస్తే పూరు కోను.

కాదురా, వెంకటేశ్వర్లు, అంత వినదగనివాడి నటరా. మిత్రుణ్ణి మోసంచేస్తే నరకానబడతావు, చెప్పు. రమణ ఒక పట్టాన వదలడని వెంకటేశ్వర్లకు తెలుసు, అందుకని.

మా యింటివెనుక రెండోబజారులో జామచెట్టు లేదూ, ఒకసారి కాయలుకోసి తిట్లు తింటివే మూడేళ్ళ క్రింద, అన్నాడు వెంకటేశ్వర్లు.

వొసీ...ఆ అమ్మాయినా, చింతాకంతకళ్ళు చేంతాడంత జడా...ఆ...నవ్వాడు రవణ.

వెంకటేశ్వర్లుకూడా నవ్వాడు.

తమాషాకు చెప్పానులే, అనుకున్నాడు వెంక టేశ్వర్లు.

కాని అది నిజమయింది. నిండు హృదయం తోటి ప్రేమించాడు వెంకటేశ్వర్లు. రోజూ, జడ పూగించుకుంటూ, కళ్ళు పెద్దవిచేసి, వెంకటేశ్వర్లు కూచునే కిటికీవైపు చూస్తూ, స్కూలుకెళ్ళేది ఆ అమ్మాయి. ఇరవైమూడో పుట్టినరోజు రాకుండానే వెంకటేశ్వర్ల అమ్మ కాస్తా చచ్చిపోయింది. ఇరవై నాలుగో పుట్టినరోజు పండుగనాడు మేనత్త చచ్చి ఆస్తికాస్తా వచ్చింది. వెంకటేశ్వర్ల గుండెల్లో కమల పదిలంగా కూచుంది. ఇంట్లోకొచ్చి వెంక టేశ్వర్లతో మాట్లాడికూడా పోయేది. ఇరవై అయిదోయేడు వస్తుందనగా వెంకటేశ్వర్ల నాన్న పెండ్లిప్రయత్నాలు చేయసాగాడు. వెంకటేశ్వర్లు ధైర్యంగా, వాళ్ళనాన్నముందు చెప్పేశాడు. వాళ్ళ నాన్న కమల వాళ్ళనాన్నతోటి మాట్లాడి, కమల జాతకాన్ని తీసుకొచ్చాడు. ఆయనకు జాతకాలంటే తగనిపిచ్చి.

వెంకటేశ్వర్ల నాన్న దగ్గరకువచ్చి జాతకాలు చూసే పెద్దమనిషి మీరీ పెళ్ళి మానుకోండి, అన్నాడు. వెంకటేశ్వర్లకు, కట్టు ఎట్టిగా కాల్చి గుండెలమీద పెట్టినట్లు అనిపించింది.

జాతకాలు చూసే పెద్దమనిషి చెప్పాడు. ఆ అమ్మాయి చేతిలో భర్తృశోకం వుందట- వెంక టేశ్వర్ల ఆశాసౌధం కూలిపోయింది.

వెంకటేశ్వర్లు నాన్న, చచ్చినా సరే, ఆ అమ్మాయిని చేసుకోనీయనన్నాడు.

కమల తెలుసుకోలేకపోయింది. వెంకటేశ్వర్లు కమలకు మొహం చూపించటమే మానేశాడు. కమల కుమిలికుమిలి, వెంకటేశ్వర్లుకు తీరని శిక్షగా, వెంకటేశ్వర్లు ఇరవై ఆరవ పుట్టినరోజు పండుగ నాడు నూతిలో పడి చచ్చిపోయింది.

తండ్రిని, జాతకం చెప్పినవాణ్ణి, వొళ్లు తెలీయకుండా తిట్టాడు వెంకటేశ్వర్లు.

ఇది పూర్వ కథ.

ఇక వెంకటేశ్వర్ల జీవితనాటకంలో ఉత్తర రంగము: రెండు సంవత్సరాలదాకా, వెంకటేశ్వర్లను పెండ్లి చేసుకోమని అడగలేకపోయాడు వాళ్ళ నాన్న. అప్పటినుంచే లోపల్లోపలనే గొణుక్కోవటం మొదలెట్టాడు. తరువాత వెంకటేశ్వర్లు పెండ్లి మాటే ఆలోచించలేదు. ఇవాళ వెంకటేశ్వర్లుకు ముప్ఫయిరెండో పుట్టినరోజు.

వెంకటేశ్వర్లు కుర్చీలో కూర్చుని, పుస్తకంలో కమల ఫోటో చూస్తూ కూచున్నాడు.

వంటవాడొచ్చి అడిగాడు "ఏంకూర చెయ్యమంటారయ్యా" అని.

ఏదోఒకటిలే పో అన్నాడు వెంకటేశ్వర్లు.

బయట ముసలాయన యింకా గొణుగుతూనే వున్నాడు.

వీధిలో "చేతులు చూస్తాం, సాముద్రికం చెపుతాం, జరిగినవీ, జరగబోయేవీ, సంతతులు చెపుతాం" అని అరుస్తూపోతున్న బైరాగుల కేక వినపడ్డది వెంకటేశ్వర్లుకు.

వెంకటేశ్వర్లుకు తమాషా వేసింది. వంటవాణ్ణిపిలిచి ఆ బైరాగులను యింట్లోకి రానియ్యమన్నాడు.

బైరాగులింట్లోకి వస్తూంటే "వీడికి కళ్యాణం గీత వుందో లేదో" అని గొణిగాడు ముసలాయన.

వెంకటేశ్వర్లు బైరాగికి చేయందించాడు.

బైరాగి చెప్పుకపోతున్నాడు.

"అదృష్టవంతులు. ఆస్తిపాస్తులకు కొదువలేదు. వొడిదుడుకులు తప్పవు. ఓ ముఖ్యవిషయం చెపుతాను, చెప్పమంటారా... సరిగ్గా ఆరేళ్ళకిందట మీ భార్య చచ్చిపోయింది. నిజమేనా?...

వెంకటేశ్వర్లు వణికిపోయాడు. బైరాగి చెప్పుకుపోతున్నాడు- మీకు మళ్ళీ పెళ్ళిగావల్సుంది. ఇంకో యేడాదిలో పెండ్లయితుంది. నిజం. తప్పక కావలె. మీ చేతిలో రెండుసార్లు వివాహం చేసుకోవాల్సినరాతవుంది. మీ భార్య... నూతిలో పడి చనిపోయింది.

వెంకటేశ్వర్లు వెంటనే వాణ్ణి పంపేశాడు.

వాకిట్లో ముసలాయన బైరాగిని నిలేసి 'కళ్యాణం రాతగురించి' అడుగుతున్నాడు.

అప్రయత్నంగా వెంకటేశ్వర్లొకసారి పిచ్చిగా నవ్వుకున్నాడు.

"ప్రథమభార్య సరిగ్గా ఆరేళ్ళక్రిందట నూతిలో పడి చచ్చిపోయింది" అనే మాటలు వెంకటేశ్వర్ల మనసులో మెదిలినయి. విచారపూరితమైన మొహంమీద దరస్మితం తొంగిచూచింది.

---

మానవ హృదయాలను శాసించి అదుపులోకి తీసుకురావడానికి ఎన్నడూ ప్రయత్నించకు. ఒక్కొక్కప్పుడు మానవ హృదయం ఇనప "స్ప్రింగు" లాంటిది: నొక్కినకొద్దీ పైకి తంతుంది. సూర్యగోళం కంటె ఎక్కువ వేడెక్కిపోగలదు; లేదా ఉత్తరధృవపు మంచుకంటె చల్లగా ఘనీభవించగలదు; మానవ హృదయానికి కాంతిరేఖను మించిన వేగం ఉంది: ఒక లిప్తకాలంలో ప్రపంచపు పొలిమేరను అంటుకుని తిరిగి రాగలదు. గంభీర కాసార గర్భంవలె ప్రశాంతంగా, నిశ్చలంగానూ ఉండగలదు, ఉద్రేకం వస్తే ప్రళయకాల ఝాంఝానిలంవలె క్షోభించిపోనూగలదు. పసిపాప అమాయకత్వం, పరమాత్మ నిగూఢతత్వం - రెంటినీ తనలో యిముడ్చుకోగలదు. వాయుగమనంతో పరిగెత్తే లేడివంటిది మానవ హృదయం: దానిని శాసించడానికి ఎన్నడూ ప్రయత్నించకు. —(చైనా తత్వవేత్త చూవాంగ్ ట్సూ)